చేప చేతికి చిక్కింది..

- 30 ఏళ్లుగా కొనసాగిన వివాదం కొలిక్కి
- 33 మందికి సభ్యత్వం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- హర్షం వ్యక్తం చేస్తున్న మత్స్యకారులు



గ్రామాల మధ్య విస్తరించి ఉన్న పెద్దచెరువు (ఫైల్)

వట్‌పల్లి(అందోల్‌): జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు వేరు, ఆ రెండు గ్రామాల మధ్య విస్తరించి ఉన్న పెద్ద చెరువు, చేపలు పట్టే హక్కు మాత్రం ఒకే ఊరి మత్స్యకారులకు సొంతం. కాగా కళ్ల ఎదుట కళకళలాడుతున్న చెరువు, చెంగుచెంగున దుంకుతున్న చేపలు కనిపిస్తున్నా ఆదాయం రాకపోవడంతో వివాదానికి దారి తీసింది. సంగారెడ్డి జిల్లా అందోల్‌ మండలం కన్‌సాన్‌పల్లి, మెదక్‌ జిల్లా అల్లాదుర్గ్‌ మండలంలోని గడి పెద్దాపూర్‌ రెండు గ్రామాల మధ్య చేపల వివాదం 30 ఏళ్లపాటుగా కొనసాగుతోంది. కన్‌సాన్‌పల్లి మత్స్యకారులు సంబంధిత శాఖ అధికారుల దగ్గరకు వెళ్లి పెద్ద చెరువులో నిబంధనల మేరకు తమకు దక్కాల్సిన వాటా ప్రకారం తమకు సభ్యత్వం కల్పించాలని కళ్లారిగేలా తిరిగారు. దీంతో చెరువులో రెండు గ్రామాల శిఖం భూమిని బట్టి 33 మంది కన్‌సాన్‌పల్లి మత్స్యకారులకు సభ్యత్వం కల్పిస్తున్నట్లు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడడంతో కన్‌సాన్‌పల్లి మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన ముప్పై ఏళ్ల వివాదం

పెద్ద చెరువులో కన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన సభ్యులదే మెజార్టీ. కానీ రికార్డుల్లో మాత్రం గడిపెద్దాపూర్‌ పెద్ద చెరువుగా నమోదు చేశారు. ఈ నేపథ్యంలో నీటి వినియోగదారుల సంఘం మాత్రం ఒక్కటే. మూడు దశాబ్దాల క్రితం ఈ చెరువులో చేపలు పట్టేందుకు మత్స్య సంఘం ఏర్పాటైంది. అయితే అప్పట్లో కన్‌సాన్‌పల్లి మత్స్యకారులు సభ్యత్వ రుసుం చెల్లించలేక సభ్యత్వం తీసుకోలేదు. దీంతో సంఘంలో గడిపెద్దాపూర్‌ మత్స్యకారులే సభ్యులుగా చేరడంతో గడిపెద్దాపూర్‌ మత్స్య సహకార సంఘంగా నమోదైంది. అప్పటి నుంచి ప్రతి ఏటా మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను వదలడం గడిపెద్దాపూర్‌ మత్స్యకారులు మాత్రమే పట్టుకోవడంతో చెరువులో శిఖం మూడంతలు మా గ్రామానికి చెందడంతో తమకు వాటా ఉంటుందని కన్‌సాన్‌పల్లి గ్రామ మత్స్యకారులు వాదించడంతో రెండు గ్రామాల మధ్య గొడవలు జరుగుతూ వచ్చాయి. కొన్ని సందర్భాల్లో కన్‌సాన్‌పల్లి గ్రామ మత్స్యకారులు చేపలు పట్టుకోవడానికి వెళ్తే గడిపెద్దాపూర్‌ వాసులు చితకబాదడం, గడిపెద్దాపూర్‌ మత్సకారులు ఇటువైపు వస్తే కన్‌సాన్‌పల్లి వాసులు దాడులు చేసుకోవడంతో రెండు గ్రామాల మధ్య కక్షలు మరింత పెరుగుతూ వచ్చాయి. కన్‌సాన్‌పల్లి మత్స్యకారులకు సభ్యత్వం కల్పించడంపై సమస్య ముగిసినట్లేనని పలువురు అంటున్నారు.



ఉత్తర్వు కాపీని అందజేస్తున్న జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు నర్సింహులు

నిబంధనలు పాటించాలి



ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న హరికృష్ణ

కల్హేర్‌(నారాయణఖేడ్‌): ఎరువులు, విత్తనాలు విక్రయించడంలో నిబంధనలు పాటించకుంటే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని సిర్గాపూర్‌ ఏఓ హరికృష్ణ హెచ్చరించారు. మంగళవారం సిర్గాపూర్‌లో విత్తనాలు, ఎరువుల షాపులు తానిఖీ చేశారు. స్టాక్‌ రిజిస్టర్‌, బిల్లు బుక్కు, ఈపాస్‌ రిపోర్టులు పరిశీలించారు. రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు కొనుగోలు చేసినప్పుడు రశీదు తీసుకోవాలని, ఆధార్‌ కార్డు తీసుకెళ్లాలని సూచించారు. ప్రైవేట్‌ డీలర్ల వద్దనే కాకుండ బొక్కస్‌గాం, కడ్పల్‌ పీఏసీఎస్‌లో ఎరువులు అందుబాటులో ఉంచామని తెలిపారు.

పీఆర్టీయూతోనే సమస్యలు పరిష్కారం



వట్‌పల్లి(అందోల్‌): సభ్యత్వాన్ని అందజేస్తున్న సంఘం నాయకులు

వట్‌పల్లి(అందోల్‌): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్టీయూతోనే సాధ్యమని ఆ శాఖ మండల అధ్యక్షుడు దిగంబర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని వట్‌పల్లి, పోతులబోడుగా, మంచిర్యాలతండా, మేడికుందా తదితర పాఠశాలల్లో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సంక్షేమమే ప్రధాన ఎజెండాగా ఏర్పడిన సంఘం పీఆర్టీయూ అని అన్నారు. ఎన్నో సౌకర్యాలు జీఓల రూపంలో ఇప్పించడంలో సంఘం కీలకపాత్ర పోషించిందన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిద్ధేశ్వర్‌, జిల్లా బాధ్యులు శ్రీనివాస్‌, రవీందర్‌, మురళీధర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌ డీఏలను చెల్లించాలి

మునిపల్లి(అందోల్‌): పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేసి ఒకే విడతలో బకాయిలను చెల్లించాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అకుల ప్రభు సంబంధిత అధికారులను కోరారు. మంగళవారం మండలంలోని మునిపల్లి మోడల్‌ స్కూల్‌, మల్లికార్జునపల్లి, మునిపల్లిపాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పదవి విరమణ చేసిన ఉపాధ్యాయులకు అందాల్సిన ప్రయోజనాలు, మెడికల్‌ బిల్లు , అర్జిత సెలవుల నగదు, జీపీఎస్‌ నగదును వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చంద్రమౌళి, ప్రధానకార్యదర్శి సురేందర్‌, నాయకులు ఉమేశ్‌, శ్రీనివాస్‌రెడ్డి, వీరన్న, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలతో క్రీడా ప్రాంగణాలు



సంగారెడ్డి టౌన్‌: క్రీడలతో యువకుల్లో మరింత ఉత్తేజం, సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడాలనే సంకల్పంతో ప్రతి గ్రామంలో గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సంగారెడ్డి మండలంలోని కులబ్‌గూర్‌తో పాటు జిల్లాలోని పలు గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాలు పిచ్చి మొక్కలు, ముళ్ల పొదళ్లు, వాహనాల పార్కింగ్‌లతో దర్శనమిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో ఎలాంటి వసతులు లేకపోవడంతో ఆటలు ఆడడానికి వీలు లేదు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలని పలు గ్రామాల యువకులు కోరుతున్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం జంగంపేట గ్రామంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ఆశాఢమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం శాకాంబరీ మాతగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. అభిషేకాలు, కుంకుమ అర్చనలు నిర్వహించారు. నిమ్మదండలతో అమ్మవారిని శాకాంబరీదేవిగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌ వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



శాకాంబరీదేవిగా దర్శనమిస్తున్న ఎల్లమ్మ

బోనాల పండుగ ఏర్పాట్లు



స్వచ్ఛత పనులను పరిశీలిస్తున్న కమిషనర్‌

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ఈనెల 20న బోనాల పండుగను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పలు ఆలయాల వద్ద చేపడుతున్న స్వచ్ఛత పనులను మున్సిపల్‌ కమిషనర్‌ కిషన్‌ ఆధ్వర్యంలో అధికారుల బృందం పరిశీలించారు. పండుగ వేళ ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని అధికారులను కమిషనర్‌ ఆదేశించారు. అలాగే, 100 రోజుల ప్రణాళిక పనులు నిర్విరామంగా కొనసాగుతున్నాయి. మంగళవారం మీదికుంట మార్గంలో పారిశుద్ధ్య సిబ్బంది చేపడుతున్న స్వచ్ఛత కార్యక్రమాలను కమిషనర్‌ కిషన్‌ పరిశీలించారు. రోడ్డు పక్కనే చెట్ల కొమ్మలు పిచ్చి మొక్కలను జేసీబీతో తొలగిస్తున్న తీరును పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ మేనేజర్‌ మల్లికార్జున స్వామి, ఆర్‌ఓ నర్సింలు, ఏఈ కిష్టయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ వినోద్‌కుమార్‌, పారిశుద్ధ్య కార్మికులు, స్థానికులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో చేరేందుకు దరఖాస్తులు

జహీరాబాద్‌: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్‌, డిగ్రీ కళాశాలల్లో చదువుకుంటున్న బాలుర సౌకర్యార్థం ప్రభుత్వం వసతి కల్పించినట్లు హాస్టల్‌ వెల్ఫేర్‌ ఆఫీసర్‌ కృష్ణ తెలిపారు. అర్హులైన బాలురు కులం, ఆదాయం, స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్‌ కార్డు, బ్యాంకు అకౌంట్‌ పాస్‌బుక్‌ తీసుకువచ్చి ప్రభుత్వ షెడ్యూల్డ్‌ కులాల అభివృద్ధి శాఖ బాలుర వసతి గృహంలో ప్రవేశం పొందాలని సూచించారు. ఆయా కళాశాలల విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

మునిపల్లి(అందోల్‌): ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ మోడల్‌ స్కూల్‌ ఔట్‌ సోర్సింగ్‌ ఎంప్లాయిస్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు నాయక్‌ ప్రభుత్వాన్ని కోరారు. 2013లో అప్పటి ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగులను ఏజెన్సీ ద్వారా ఎంపిక చేసింది. ఏజెన్సీని తొలగించి ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు పెంచాలన్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాన్ని పోషిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన పీఆర్సీలో ప్రకటించినట్లు ప్రతి సంవత్సరం రూ.1000 ఇంక్రిమెంట్‌ ఇస్తామని ఇప్పటివరకు ఇవ్వలేదని ఆరోపించారు.

క్లుప్తంగా

వేతనాలు పెంచాలని నిరసన



ధర్నా చేస్తున్న కార్మికులు

నారాయణఖేడ్‌: మున్సిపల్‌ డ్రైవర్లు, వాటర్‌మెన్‌, ఆపరేటర్ల వేతనాలు పెంచాలని సీఐటీయూ ఖేడ్‌ డివిజన్‌ కార్యదర్శి రమేశ్‌ డిమాండ్‌ చేశారు. మంగళవారం మున్సిపల్‌ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైవర్లు, వాటర్‌మెన్‌, ఆపరేటర్లు తక్కువ వేతనంతో పని చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలతో వీరి జీవనం కష్టతరంగా ఉందన్నారు. పట్టణ జనాభాను దృష్టిలో ఉంచుకొని కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. సీఐటీయూ మున్సిపల్‌ యూనియన్‌ నాయకులు రవి, నాగయ్య, కుమార్‌, నారాయణ, గోపాల్‌, ఆదాం, ప్రవీణ్‌, అంబయ్య, దిలీప్‌, సగయ్య, తుకారాం పాల్గొన్నారు.

సేఫ్టీ స్పెషల్‌ డ్రైవ్‌



పనులు పరిశీలిస్తున్న సింధురెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్‌ డివిజన్‌ పరిధిలోని మ్యాక్‌సొసైటీ కాలనీలో మంగళవారం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో సేఫ్టీ స్పెషల్‌ డ్రైవ్‌ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్‌ సింధురెడ్డి హాజరయ్యారు. కాలనీకు వెళ్లే రోడ్లకు మరమ్మతులు చేశారు. కాలనీలోని పార్కులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌ పరిధిలో రోడ్లపై గుంతలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డివిజన్‌ పరిధిలోని కాలనీల్లో పార్కుల అభివృద్ధి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా



అక్రమనిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

జిన్నారం (పటాన్‌చెరు): ప్రభుత్వ భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు. గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నం 27 తెలంగాణ కాలనీలో కొంతకాలంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని తహసీల్దార్‌ కార్యాలయంలో స్థానికులు ఫిర్యాదులు చేశారు. మంగళవారం తహసీల్దార్‌ దేవదాసు ఆదేశాలతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ జయప్రకాష్‌నారాయణ నిర్మాణ దశలో ఉన్న 8 బెస్మెంట్‌లను, రెండు గదులను జేసీబీతో నేలమట్టం చేశారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమనిర్మాణాలు చేపడితే చట్టరీత్యా శిక్షార్హులని ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

లక్ష్యం మేర మొక్కలు నాటాలి

రాయికోడ్‌(అందోల్‌): వనమహోత్సవంలో భాగంగా లక్ష్యం మేర మొక్కలు నాటించాలని ఎంపీడీఓ ఎం.ఎం.షరీఫ్‌ పేర్కొన్నారు. మండలంలోని కర్చల్‌ గ్రామాన్ని ఏపీఓ రమేశ్‌తో కలిసి సందర్శించారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పంచాయతీ కార్యదర్శికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఈ ఏడాది 93 వేల మొక్కలు నాటేలా నిర్ణయించామన్నారు. ఇప్పటివరకు 22 వేల గుంతలను తీయించగా 17,100 మొక్కలు నాటినట్లు తెలిపారు. ఇందులో ప్రతి ఒకరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఎఫ్‌ఓ రవి, స్థానికులు ఉన్నారు.

సీజనల్‌ వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి, వార్డెన్‌

జహీరాబాద్‌: సీజనల్‌ వ్యాధులపై హాస్టల్‌ విద్యార్థులకు అర్బన్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సోహెల్‌ పలు సూచనలు చేశారు. మంగళవారం జహీరాబాద్‌ పట్టణంలోని షెడ్యూల్‌ కులాల అభివృద్ధి శాఖ వసతి గృహంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బయట ఆహార పదార్థాలను తినకూడదని, నివసించే గది, పరిసరాలు, దుస్తులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో వసతి గృహం సంక్షేమాధికారి కృష్ణవంశీ, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

భోజనశాల నిర్మాణానికి ప్రతిపాదనలు

పాఠశాలను పరిశీలించిన అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌

సాక్షి ఎఫెక్ట్‌..



సమస్యలు తెలుసుకుంటున్న చంద్రశేఖర్‌

హత్నూర(సంగారెడ్డి): ఈ నెల 4న 'చెట్లకిందే భోజనాలు' అనే కథనం ప్రచురితం అయింది. మంగళవారం హత్నూర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనశాల, వంటశాల హాస్టల్‌ భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు చెట్ల కింది భోజనం కోసం నిరీక్షిస్తున్న సమయంలోనే అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌ వచ్చారు. విద్యార్థులతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. రెండు సంవత్సరాల నుంచి భోజనశాల శిథిల చేరితే చెట్ల కింద భోజనాలు చేస్తున్న విషయం ఎందుకు అధికారుల దృష్టికి తీసుకురాలేదని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ శంకర్‌ను కలెక్టర్‌ మందలించారు. తాను ఇటీవలే ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ బాధ్యతలు చేపట్టినట్లు శంకర్‌ చెప్పడంతో అదనపు కలెక్టర్‌ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. విద్యార్థులను ఇబ్బందులు పడితే సహించేది లేద న్నారు. ఇంజనీరింగ్‌ శాఖ జిల్లా అధికారులకు అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌ ఫోన్‌ చేసి వెంటనే భోజన శాల, వంటశాల హాస్టల్‌ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాల్సిందిగా ఆదేశించారు. విద్యార్థులకు అసౌకర్యం జరిగితే ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల చేత పరిసరాల పరిశుభ్రత ఇతర పనులు చేయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్‌, ఎంపీఈఓ యూసుఫ్‌, గ్రామపంచాయతీ కార్య దర్శి మహేశ్‌, కులపాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

డీసీసీబీ ద్వారా అధిక వడ్డీ చెల్లింపు



అవగాహన కల్పిస్తున్న మేనేజర్‌ వెంకటేశం

నారాయణఖేడ్‌: ఖాతాదారులకు మెరుగైన సేవలతో పాటు అన్ని బ్యాంకులకంటే డిపాజిట్లపై అధిక వడ్డీ చెల్లించనున్నట్లు జిల్లా కోఆపరేటీవ్‌ సెంట్రల్‌ బ్యాంకు ఖేడ్‌ శాఖ మేనేజర్‌ వెంకటేశం తెలిపారు. మంగళవారం నిజాంపేట్‌ మండలంలోని మెగ్యానాయక్‌ తండా, దర్గా తండాల్లో గ్రామసభలు నిర్వహించారు. బ్యాంకు ద్వారా విద్య, హౌసింగ్‌, వ్యాపార రుణాలు అందించనున్నట్లు చెప్పారు. అత్యాధునిక లాకర్‌ సదుపాయం, బంగారం తులం రూ.65 వేల వరకు రుణం అందించనున్నట్లు తెలిపారు. తమ ఖాతాదారులు ఆన్‌లైన్‌ సేవలన్నీ పొందవచ్చని, ఫోన్‌పే సదుపాయం పొందే అవకాశం ఉందన్నారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి యోజన (పీఎంజీజేవై), ప్రధానమంత్రి సురక్ష యోజన ఇన్సూరెన్స్‌ పథకాలు వర్తిస్తాయన్నారు. డిపాజిట్లపై 7.75శాతం వడ్డీ అన్ని బ్యాంకులకంటే అధికంగా అందిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్‌ ఆఫీసర్‌ చక్రవర్తి, మహేశ్‌ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల జాతర

జిల్లాలోని ఆయా గ్రామాల్లో మంగళవారం ఆశాఢ మాస బోనాల ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు అమ్మవార్లకు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, డప్పుల చప్పుళ్ల, శివసత్తుల పునకాల మధ్య ఊరేగింపు సాగింది. వర్షాలు కురిసి, పాడి పంటలు బాగా పండాలని మొక్కున్నారు.



సదాశివపేట: రజక కేరీలో బోనాల ఊరేగింపు



హత్నూరలో పోచమ్మతల్లి జాతర ఉత్సవాలు



వట్‌పల్లి(అందోల్‌): కన్‌సాన్‌పల్లిలో బోనాలతో మహిళలు



సదాశివపేట పట్టణంలో..



బోనాలతో ఊరేగింపుగా కదిలిన మహిళలు

ఆయిల్‌పాం సాగు లాభదాయకం



కల్హేర్‌(నారాయణఖేడ్‌): సమావేశంలో మాట్లాడుతున్న నూతన్‌కుమార్‌

కల్హేర్‌(నారాయణఖేడ్‌): ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌ పామ్‌ సాగు చాలా లాభదాయకమని నారాయణఖేడ్‌ ఏడీఏ నూతన్‌కుమార్‌ సూచించారు. మంగళవారం కల్హేర్‌ రైతు వేదికలో వ్యవసాయ, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్‌ సాగుపై శిక్షణ నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ.. ఆయిల్‌ పామ్‌ సాగుపై ఆసక్తి గల రైతులు వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. ఉద్యానశాఖ అధికారి పండరి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సబ్సిడీ, ఆయిల్‌పామ్‌ సాగు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నర్సింహరెడ్డి, మాజీ ఎంపీపీ మల్లేశం, ఎఓ వెంకటేశం, మాజీ సర్పంచ్‌ లక్ష్మీనారాయణ, ఏఈఓలు కృష్ణవేణి, సంతోష, మధు, కాంగ్రెస్‌ నాయకులు తుకారాం పాల్గొన్నారు.

ఆయిల్‌ పామ్‌ సాగుపై అవగాహన

హత్నూర (సంగారెడ్డి): రైతులకు క్షేత్రస్థాయిలో ఆయిల్‌ పామ్‌ సాగుపై అవగాహన కల్పించనున్నట్లు ఉద్యానవన శాఖ జోగిపేట డివిజన్‌ ఇన్‌చార్జ సమత అన్నారు. మంగళవారం హత్నూర మండలం చింతల్చెరువు రైతువేదికలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ డివిజన్‌ ఇంచార్జ్‌ సమత మాట్లాడుతూ ఆయిల్‌ పామ్‌ పంట సాగుకు ప్రభుత్వం ఎకరా మొక్కలకు రూ. 11600, మెయింటెనెన్స్‌కు రూ.16800, డ్రిప్‌ ఇరిగేషన్‌కు 22000, ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందించనుందన్నారు. రకాల భూములు సాగుకు అనుకూలమని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **డ్రంకెన్‌ డ్రైవ్‌లో ఒకరి జైలు**

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ కథనం ప్రకారం.. సోమవారం నిర్వహించిన తనిఖీల్లో 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా ఏడుగురికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి, మరో ముగ్గురికి రూ.1500, ఒకరికి రూ. 2వేలు, మరో వ్యక్తికి జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

◆ **ఫైలేరియాపై అవగాహన**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో మంగళవారం మహేశ్వరం మెడికల్‌ కాలేజీ ట్రైనీ డాక్టర్లు ఫైలేరియా, నులిపురుగులు నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డా.కల్పనా పాల్గొన్నారు. ఆగస్టు10 నుంచి 25వ తేదీ వరకు ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

◆ **రింగురోడ్డు పనుల పరిశీలన**



నారాయణఖేడ్‌: ఖేడ్‌ పట్టణం చుట్టూ రింగురోడ్డుగా నిర్మిస్తున్న లింకు రోడ్లను మంగళవారం జిల్లా కాంగ్రెస్‌ నాయకులు సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు మూఢ రామకృష్ణ, పండరిరెడ్డి పరిశీలించారు. పట్టణ శివారులోని మనూరు క్రాస్‌ రోడ్డు నుంచి కంగ్టి, సిర్గాపూర్‌ రోడ్ల మీదుగా నిజాంపేట -ఖేడ్‌ -బీదర్‌ 161బీ జాతీయ రహదారిని కలుపుతూ నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించారు. రింగు రోడ్డు నిర్మాణంతో పట్టణంలో ఉన్న ట్రాఫిక్‌ సమస్యలు దూరమవుతాయని తెలిపారు.

◆ **బస్తీదర్శన్‌**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్‌ పరిధిలోని పాత రామచంద్రాపురం పాషా కాలనీలో మంగళవారం జీహెచ్‌ఎంసీ బస్తీ దర్శన్‌ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. వర్షాకాలంలో ఇళ్లలోకి నీళ్ల వస్తున్నట్లు తెలిపారు. చెత్త కారణంగా దోమల బెడద ఎక్కువగా ఉందన్నారు. వాటితో పలు సమస్యలను అధికారులకు తెలిపారు. అనంతరం కార్పొరేటర్‌ బి.పుష్ప మాట్లాడుతూ..కాలనీవాసులు తన దృష్టికి తెచ్చిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చాంద్‌, రఫీక్‌, నవీన్‌గౌడ్‌, శ్రీను, కిరణ్‌గౌడ్‌ పాల్గొన్నారు.

◆ **వేగవంతంగా పూర్తి చేయాలి**

సంగారెడ్డి టౌన్‌: మండలంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని సంగారెడ్డి ఎంపీడీఓ యాదగిరి అన్నారు. మంగళవారం ఇరిగిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఇళ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 146 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారని తొందరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

◆ **ఇందిరమ్మ ఇళ్ల పనుల పరిశీలన**

నారాయణఖేడ్‌: ఇందిరమ్మ ఇళ్ల బెస్మెంట్‌ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకుంటే వారి వారి ఖాతాల్లో మొదటి బిల్లుగా రూ.1లక్ష జమ చేయనున్నట్లు నిజాంపేట్‌ ఎంపీడీఓ సంగ్రాం తెలిపారు. నిజాంపేట్‌ మండలంలోని నిజాంపేట్‌, బాచేపల్లి, రాంరెడ్డిపేట్‌, బల్కంచెల్కతండా, నాగోనికుంట తండాల్లో మంగళవారం నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మిళఇళ్లను పరిశీలించారు. పలువురి నిర్మాణాలు బేస్‌మెంట్‌ స్థాయి పూర్తి చేసుకుంటుండడంతో పలు సూచనలు చేశారు. అలాగే, ఖేడ్‌లోని వెంకటాపూర్‌ చౌరస్తా సమీపంలోని మండల పరిషత్‌ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మాడల్‌ హౌస్‌ను మంగళవారం హౌసింగ్‌ డిప్యూటీ ఈఈ సతీస్‌ తివారీ పరిశీలించారు.

◆ **ఆర్థిక సహాయం అందజేత**

కొండాపూర్‌(సంగారెడ్డి): మండలంలోని గొల్లపల్లిలో ఇటీవలే కరెంట్‌ షాక్‌తో చాకలి మాణయ్య అతడి కుమారుడు వెంకటేశ్‌ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌ నాయకులు పడమటి అనంత్‌రెడ్డి మంగళవారం ఆ కుటుంబానికి రూ 25 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే ఇంట్లో ఒకే సారి తండ్రీకొడుకులు మృత్యువాత పడడం బాధకరమన్నారు.

◆ **కట్ట మైసమ్మకు పూజలు**

కల్హేర్‌(నారాయణఖేడ్‌): మండలంలోని బీబీపేట్‌లో గ్రామస్తులు కట్టమైసమ్మకు పూజలు చేశారు. గ్రామ శివారులోని రామేశ్వరం చెరువులో గంగమ్మకు పూజలు చేసి తెప్పోత్సవం నిర్వహించారు. వర్షాలు కురిసి బంగారు పంటలు పండాలని దేవుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ ఎస్సీసెల్‌ మండల అధ్యక్షుడు సాయిలు పాల్గొన్నారు.

◆ **హుండీ ఆదాయం రూ.1.25 లక్షలు**

నారాయణఖేడ్‌: పట్టణంలోని కట్టమైసమ్మ ఆలయంలో మంగళవారం హుండీని లెక్కించారు. ఆదాయం రూ.1,25,850లు వచ్చినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రభు యాదవ్‌ తెలిపారు. ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం బోనాల పండుగ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు హుండీలో కానుకలు సమర్పించారు.